

చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్

చేనేత వస్త్రాలను ధరించండి: శైలజా రామయ్యర్

యూసుఫ్ గూడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలను ధరించి, చేనేత పరిశ్రమ, కళాకారులకు అండగా నిలవాలని హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ అన్నారు. గురువారం శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్‌గ్యాలరీ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశంలో 14 రాష్ట్రాలకు చెందిన చేనేత కళాకారుల ఉత్పత్తులు నైపుణ్యానికి, నాణ్యతకు వేదికగా నిలుస్తాయని అన్నారు. మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ సహకారంతో చేనేతకారుల ఉత్పత్తులను ఎగ్జిబిషన్‌లో 80 స్టాల్స్ ఈ నెల 10వరకు వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. చేనేత కారుల ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందిస్తున్న నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్ కుమార్‌లను తయారీ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు.

దివ్యాంగుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి

తెలంగాణ రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు



చిన్నారులకు పజిల్స్, బోర్డ్ గేమ్స్ అందజేస్తున్న బాలలహక్కుల కమిషన్ సభ్యులు

పంజాగుట్ట, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు అన్నారు. వైకల్యం ఉన్న పిల్లలను చిన్నచూపు చూడవద్దని వారిని ప్రోత్సహిస్తే బాగున్న వారికన్నా ఎక్కువగా రాణిస్తారని అన్నారు. ప్రపంచ దివ్యాంగుల వారోత్సవాలలో భాగంగా కమిషన్ సభ్యులు వందన గౌడ్, బండి అపర్ణ, ఎం.చంద్రణ, వచన్ కుమార్, ప్రేమలత అగర్వాల్‌లు స్టేట్ హోంలో ఆశ్రయం పొందుతున్న వారికి విద్యాపరమైన పజిల్స్, బోర్డ్ గేమ్స్‌ను పరికరాలను అందజేశారు. వారి మానసిక అభివృద్ధి, సమగ్రతను ప్రోత్సహించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. కొద్దిసేపు చిన్నారులతో సరదాగా వారు గడిపారు. కార్యక్రమంలో స్టేట్ హోమ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఖైరతాబాద్ నూతన డీసీసీ అధ్యక్షుడు మోత రోహిత్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలుపుతున్న కార్పొరేటర్ వనం సంగీతయాదవ్

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చర్యలు: రోహిత్

బేగంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ పాటు పడాలని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు మోత రోహిత్ ముదిరాజ్ అన్నారు. గురువారం సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతయాదవ్ తన అనుచరులతో కలిసి ఖైరతాబాద్ నూతన డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మోత రోహిత్ ముదిరాజ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

మాజీ ఎంపీ ఆగడాలపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు మర్రి వెంకటస్వామి

పంజాగుట్ట, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ మాజీ ఎంపీ, ఆయన బినామీ ఆగడాలపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని పలువురు బాధితులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అచ్యుత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు మర్రి వెంకటస్వామి,అధ్యక్షుడు ఆర్.ఎస్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి కపిల్ కుమార్ శర్మరైతు నాయకులు రవికిరణ్ రెడ్డి, ప్లాట్ల యజమానుల సంఘం ప్రతినిధి ప్రమోద్ గౌడ్,కృష్ణా రెడ్డి, తదితరులు మాట్లాడారు. తీవ్ర ఆర్థిక కష్టాలతో కొట్టుమిట్టాడుతూ ఆరోపణలు ఎదుర్కొంటున్న షామీర్‌పేట మండలానికి చెందిన ఓ రిసార్ట్‌ను అతి తక్కువ ధరకు చేజిక్కించుకున్న ఆ మాజీ ఎంపీ, ఆయన బినామీ వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



వివిధ కారణాలతో మృతి చెందిన ముగ్గురు జీహెచ్‌ఎంసీ కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున చెక్కులను గురువారం సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అందజేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

- హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి)



సీపీఐ జాతీయ నాయకుడు నారాయణను కలిసిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్

సీపీఐ నారాయణను కలిసిన ఎమ్మెల్యే నవీన్

యూసుఫ్ గూడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జూబ్లీ ఉప ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించి, కలిసి పనిచేసిన సీపీఐ కార్యకర్తలు ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు అభినందనలు తెలిపారు. గురువారం సీపీఐ జాతీయ నాయకుడు కె.నారాయణను పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, పార్టీ నాయకులు పాశ్య పద్మ, వివిఎస్ బోసు, ఛాయాదేవి, స్టాలిన్, కమతం యాదగిరి, పల్లె నర్సింహ ఉన్నారు.

‘హిల్ట్’పై అనవసర రాద్ధాంతం

- ఈ పాలసీని స్వార్థ రాజకీయాల కోసం వాడుకుంటున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు
- గత ప్రభుత్వ జీవోను మూలన పడేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- స్పీక్ సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ గోపాలం



సమావేశంలో మాట్లాడుతున్న స్పీక్ అధ్యక్షుడు ప్రొఫెసర్ గోపాలం విద్యాసాగర్

పంజాగుట్ట, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల ఉన్న వివిధ పారిశ్రామిక ప్రాంతాలను నివాస, వ్యాపారయోగ్యమైన ప్రాంతాలుగా మార్చడానికి, కాలుష్య రహిత హైదరాబాద్‌ను సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్ ఫర్మేషన్ పాలసీ (హిల్ట్)పై విడుదల చేసిన జీవోపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ స్వార్థ రాజకీయాల కోసం అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని సొసైటీ ఫర్ పొలిటికల్ ఎంపవర్మెంట్ విత్ యాక్షన్ అండ్ నాలెడ్జ్ (స్పీక్) సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ గోపాలం విద్యాసాగర్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ గౌరవ సలహాదారు అన్నె సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి మురళీ కుమార్, సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని బలోపేతం చేయడానికి, టీజీఐఐసీ కార్యకలాపాలు విస్తృతంగా నిర్వహించడానికి, పరిశ్రమలను క్యూర్ నుంచి ప్యూర్ ప్రాంతానికి తరలిస్తే అక్కడ పరిశ్రమలను అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా ఒక బలమైన ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడం సాధ్యమవుతుందన్నారు. నగరాన్ని పట్టి పీడిస్తున్న కాలుష్యం నుంచి ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించినట్లు అవుతుందని తెలిపారు. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఓఆర్ఆర్ లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను తరలించడానికి 2013లో జీవో విడుదల చేసిందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ జీవోను పట్టించుకోలేదన్నారు. హిల్ట్ పాలసీని వ్యతిరేకించడం అంటే రాష్ట్ర అభివృద్ధిని, సంక్షేమాన్ని అడ్డుకోవడమేనన్నారు. ఈ సమావేశంలో సంస్థ సభ్యులు ఉన్నం వెంకటేశ్వర్లు, వెంకట నరసింహ రావు, దేవేందర్, మధుసూదన్ రావు, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో బీసీల వాణి వినిపిస్తా : నవీన్ యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, చిత్రంలో జాజుల, గుజ్జ కృష్ణ, గణేష్‌చారి

గన్‌పార్క్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల పెంపు, వారి సంక్షేమంపై అసెంబ్లీలో బీసీల వాణిని వినిపిస్తానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ తెలిపారు. స్థానిక సంస్థలు, గ్రేటర్ మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకే సింహభాగం టికెట్ల కేటాయింపునకు కాంగ్రెస్ అగ్ర నాయకత్వానికి తప్పక విన్నవిస్తానన్నారు. గురువారం సాయంత్రం సోమాట్ భవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం, బీసీ జేఏసీ జాతీయ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల పెంపుపై సంఘీభావం ప్రకటించారు. అనంతరం మీడియా సమావేశంలో నవీన్‌యాదవ్ మాట్లాడారు. రాష్ట్రంలో బీసీల రాజకీయ విప్లవం, బీసీ నినాదం మరింత బలపడిందన్నారు. బీసీలకు సీట్లు కేటాయిస్తే అఖండ మెజార్టీని సాధిస్తారన్నారు. బీసీ సంఘాల కృషి ఫలితమే తనకు విజయం వరించిందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షు డు మహేశ్‌కుమార్‌గౌడ్ అవకాశం కల్పించారన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత విషయంలో బీజేపీ బీసీలను మోసం చేసిందని గుణపాఠం చెప్పాలన్నారు. బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, బీసీలు గెలుపు గుర్రాలు, బీసీ విప్లవంతో స్థానిక ఎన్నికల్లో బీసీలు అధికంగా సీట్లు కైవసం చేసుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం బీసీ సంఘాల ఆధ్వర్యంలో నవీన్‌యాదవ్‌కు శాలువా కప్పి సన్మానించారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, బీసీ జేఏసీ జాతీయ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్లు కులకచర్ల శ్రీనివాస్, విక్రంగౌడ్, బీసీ సంఘం రాష్ట్ర బాధ్యురాలు మణిమంజరి, బీసీ కుల సంఘాల అధ్యక్షులు శేఖర్, వీరస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ అధికారుల పనితీరుపై సర్వే ప్రారంభం

పంజాగుట్ట, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ (వైఏసీ) ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వ అధికారుల పనితీరుపై, అవినీతి నిర్మూలనపై సర్వే నిర్వహిస్తున్నారు. గురువారం ఎర్రమంజిల్ కాలనీ లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, వ్యవసాయ శాఖ రిటైర్డ్ అధికారి అశోక్ కుమార్, సంస్థ వ్యవస్థాపకుడు రాజేంద్రతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతిపై ప్రశ్నించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ సర్వే వలన అవినీతి ఏ దశలో ఉంది, ప్రభుత్వాలు,అధికారులు ఎలా పనిచేస్తున్నారో తెలిసిపోతుందన్నారు. తమ వాలంటీర్లు ప్రతి నియోజకవర్గం వెళతారని రాజేంద్ర తెలిపారు. సర్వే ఆన్ లైన్, ఆఫ్ లైన్ రెండు విధాలుగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సర్వేలో పాల్గొని తమ అభిప్రాయం వ్యక్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు డా. స్రవంతి, గీతా, స్వప్న, జీవన,కె.దేవేందర్, వంశీ కృష్ణ ఎల్. రాజేశ్, నర్సింగం, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అమీర్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం

‘గుడ్ టచ్, బ్యాడ్ టచ్’ పై అవగాహన

అమీర్‌పేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు షీ టీం, ఆర్‌బీఎస్, ఐసీడీఎస్ శాఖల ప్రతినిధులు సంయుక్తంగా పలు రంగాలపై అవగాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా ఉమెన్ సేఫ్టీ వింగ్, భరో సా, సైబర్ క్రైమ్, పోక్సో యాక్ట్, సేఫ్‌టాక్స్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సోషల్ మీడియా, అనధికార యాప్‌లు, వాటి దుర్వినియోగం, విద్య దాని ప్రాముఖ్యత అంశాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ వెంకటమ్మ, షీటీం చెందిన ఫకీజా బేగంలు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ నుంచి రక్షణ ఎలా పొందాలి, ఆన్‌లైన్ మోసాలు ఎలా జరుగుతాయో క్లుప్తంగా వివరించారు. అలాగే చిన్నారుల భద్రతను దృష్టిలో పెట్టుకుని గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై స్పష్టమైన శిక్షణ ఇచ్చారు. పిల్లలకు అనుమానం కలిగినప్పుడు వెంటనే పెద్దలకు తెలుపాలన్నారు. ప్రత్యేకంగా విద్యార్థులు సోషల్ మీడియాలో ఫేక్‌ఐడీలు, ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు, అనుమానస్పద లింకులు, మోసాల గురించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఎనిమియా, రక్తహీనత కు గురికాకుండా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్ నుంచి సుకన్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫాతిమా బేగం, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సాగర్, అంగన్ వాడీ టీచర్ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

రోలర్ స్కేటింగ్ పోటీ విజేతలు

పంజాగుట్ట, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): యూసుఫ్ గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్‌స్టేడియంలో గురువారం నిర్వహించిన 2వ యంగ్ ఇంటర్‌స్కూల్ రోలర్‌స్కేటింగ్ పోటీలలో మధురానగర్ కాలనీలోని శ్రీనిధి విశ్వభారతి, స్వీట్ ఏంజిల్ స్కూల్ విద్యార్థులు వివిధ కేటగిరీలలో అత్యధిక పతకాలు సాధించి ఛాంపియన్స్ గా నిలిచారు. 5 నుంచి 7 సంవత్సరాల వయస్సు మధ్య విభాగంలో వివాన్ష్ (బంగారు పతకం), 7 నుంచి 9 సంవత్సరాల మధ్య విభాగంలో వర్షిత సింగ్,సుజిత్ రెడ్డి (బంగారు పతకం), లక్ష్మీ శన్ముఖి(వెండి), హాసిని లంక (కాంస్య పతకం), 8 నుంచి 11 సంవత్సరాల మధ్య విభాగంలో కె.రోనిత, లికిత్ సేన్(బంగారు),మిస్బా(కాంస్య),9 నుంచి 11 సంవత్సరాల మధ్య విభాగంలో సిమాన్ష్, తనీష్ (బంగారు), షణ్ముఖ స్నిగ్ధ, అశ్విత్(వెండి), తీక్షిత (కాంస్య), 11 నుంచి 14 సంవత్సరాల మధ్య విభాగంలో ఉపాసన(కాంస్య), 12 నుంచి 14 సంవత్సరాల మధ్య విభాగంలో రిత్విక్ సాయి(కాంస్య) పతకాలు గెలుచుకున్నారు. పోటీలో పతకాలు గెలుచుకున్న విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ కొల్లి లక్ష్మణ్ రావు, ప్రిన్సిపాల్ గీత, వైస్ ప్రిన్సిపాల్ విమల, రాజేశ్వరి, స్కేటింగ్ మాస్టర్ జితేందర్,వర్ష సింగ్, శ్రీలతలు అభినందించారు.



మాట్లాడుతున్న ముదిరాజ్ పోరాట సమితి అధ్యక్షుడు మహేష్

ముదిరాజ్ అభ్యర్థులను గెలిపించుకుందాం

సుంకరబోయిన మహేష్ ముదిరాజ్

పంజాగుట్ట, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం పోరాటం చేస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేస్తున్న ముదిరాజ్ సామాజిక వర్గం అభ్యర్థులను గెలిపించుకుందామని తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి అధ్యక్షుడు సుంకరబోయిన మహేష్ ముదిరాజ్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పరపల్లి రంజిత్ ముదిరాజ్, కార్యదర్శి తలారి రవి ముదిరాజ్, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. సమావేశంలో సమితి నాయకులు వీరేష్ ముదిరాజ్, పి.గణేష్ ముదిరాజ్, మహేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల భూములను ప్రజల కోసమే వినియోగించాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



సనత్‌నగర్‌లోని పరిశ్రమల భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు తలసాని, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ నవీన్‌రావు

బేగంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల భూములను ప్రజల అవసరాలకే ఉపయోగించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం సనత్‌నగర్‌లోని పారిశ్రామిక వాడ ప్రాంతంలో ఎమ్మెల్సీ నవీన్‌రావు, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భం గా తలసాని మాట్లాడుతూ, నగరం విస్తరించడంతో ఇక్కడ ఉన్న పరిశ్రమలను నగర వెలుపలకు తరలించడం జరిగిందన్నారు. తరలించిన పరిశ్రమలకు చెందిన భూములను అతి తక్కువ ధరలకు బడా వ్యక్తులకు కట్టబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. సనత్‌నగర్‌లోని పరిశ్రమలకు సంబంధించి 87.31 ఎకరాల భూమి ఉండగా, రిజిస్ట్రేషన్ శాఖ విలువ ఎకరం రూ.21 కోట్లు ఉందని, ఓపెన్ మార్కెట్ విలువ 43 నుంచి రూ.45 కోట్లు పలుకుతుందన్నారు. కాని ఈ ప్రభుత్వం దీనిని ఒక్కో ఎకరం రూ.6.31 కోట్లకు ధారాదత్తం చేయాలని చూస్తుందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని 21 ప్రాంతాల్లో ఉన్న 9292 ఎకరాల భూమిని ఇండస్ట్రీయల్ ల్యాండ్ ట్రాన్స్ రేషన్ పాలసీ పేరుతో తక్కువ ధరకు ప్రయివేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ పాలసీ వెనుక సుమా రు రూ.5 లక్షల కోట్ల కుంభకోణం దాగుందన్నారు. పరిశ్రమలకు చెందిన భూముల్లో 50 శాతం భూమిని ప్రజల అవసరాలకు ఉపయోగించాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభు త్వం ప్రజల అవసరాలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. భూ దోపి డీపై మంత్రులు ప్రజల్లోకి వచ్చి సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు కష్టాలు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, నాయకులు టి. శ్రీహరి, శేఖర్ ముదిరాజ్, నరేందర్ రావు, లక్ష్మీపతి, కిశోర్, ఖలీల్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

లక్షకు.. లక్షా ఇరవై వేలు..

దుబాయి కరెన్సీ పేరుతో బురిడీ!

బేగంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లక్ష రూపాయలు తీసుకుని నకిలీ దుబాయి కరెన్సీ పేరుతో ఒకరికి తెల్ల కాగితాలు అంటగట్టి బురిడీ కొట్టించిన ఘటన సనత్‌నగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బోరబండకు చెందిన సయ్యద్.. ర్యాపిడో డ్రైవర్. ఈనెల 29వ తేదీన గచ్చిబౌలి నుంచి ఓ వ్యక్తి ర్యాపిడో బుక్ చేసుకున్నాడు. తన వద్ద దుబాయి కరెన్సీ ఉందని, మన కరెన్సీ లక్ష ఇస్తే లక్షా ఇరవై వేల విలువైన దుబాయి కరెన్సీ ఇస్తానని డ్రైవర్ సయ్యద్ ను నమ్మించి తన ఫోన్ నెంబరు ఇచ్చాడు. మరుసటి రోజు సయ్యద్ ఆ వ్యక్తిని కలిసి లక్ష రూపాయలు ఇవ్వడంతో అతను దుబాయి కరెన్సీగా చెప్పిన నోట్లను అందజేశాడు. తీరా లోపల అన్ని తెల్ల కాగితాలు ఉండడం గమనించగా అప్పటికే సదరు వ్యక్తి పరారయ్యాడు. దీంతో మోస పోయానని గ్రహించిన ర్యాపిడో డ్రైవర్ సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యూ ట్యూబ్ రిపోర్టర్ పై కేసు నమోదు

పంజాగుట్ట, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఓ నిర్మాణ సంస్థ నుంచి డబ్బులు డిమాండ్ చేసిన యూ ట్యూబ్ రిపోర్టర్ పై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లో కేసు నమోదయ్యింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ యూ ట్యూబర్ పంజాగుట్ట పీఎస్ పరిధిలో కార్యాలయం ఉన్న ఒక నిర్మాణ సంస్థ చేపడుతున్న పనులను వీడియో తీశాడు. దాని ఆధారంగా నిర్మాణంలో నిబంధనలు పాటించడం లేదు. ఆ వీడియోలు ప్లే చేయకుండా ఉండడానికి రూ.40 లక్షలు డిమాండ్ చేశాడు. సదరు సంస్థ నిర్వాహకులను డబ్బులు ఇవ్వాలని బ్లాక్ మెయి ల్ చేస్తున్నాడు. అతని వేధింపులు భరించలేక సంస్థ ప్రతినిధులు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాల ఆధారంగా అతన్ని అదుపులోకి తీసుకున్నారు.



నిందితులతో మానసిక చికిత్సాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేయిస్తున్న బోరబండ పోలీసులు

మానసిక చికిత్సాలయ ప్రాంగణం శుభ్రం

బోరబండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిన్న చిన్న కేసుల్లో నిందితులుగా ఉన్న వారితో బోరబండ పోలీసులు మానసిక చికిత్సాలయ ఆస్పత్రి ప్రాంగణాన్ని గురువారం శుభ్రం చేయించారు. బహిరంగ మద్యపానం, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, సిగ్నల్ బ్రేకింగ్, బండి నడిపే సమయంలో సెల్ ఫోన్ వాడకం వంటి కేసుల్లో బోరబండ పోలీసులు 28 మందిపై కేసులు నమోదు చేశారు. నిందితులైన వారితో నాంపల్లి కోర్టు తీర్పు, వెస్ట్ జోన్ డీసీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పోలీసులు సమాజసేవలో భాగంగా ఆస్పత్రి ప్రాంగణంలో పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమం చేయించారు. ఈ ప్రాంగణంలో ఊడ్చటం, చెత్త ఎత్తడం, పిచ్చి మొక్కలు తొలగించే పనులను చేయించారు. బోరబండ సీఐ ఎం.సురేందర్, ఎస్.ఐ.లు షేక్ నాగుల్ మీరా, నాగేంద్రబాబు, కోర్టు వ్యవహారాలు చూసే శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఎస్పీఆర్ హిల్స్‌లో పూజలు చేస్తున్న భక్తులు


ఘనంగా దత్తాత్రేయ జయంతి

బోరబండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీ దత్త జయంతిని ఎస్పీఆర్ హిల్స్ ఇందిరానగర్ ఫేస్-2లో గురువారం ఘనంగా నిర్వహించారు. బస్తీలోని షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో భక్తులు దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్గశిర మాసం పూర్ణిమ రోజున దత్తాత్రేయ జయంతి రావడం అరుదని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. దత్తాత్రేయ జయంతి సందర్భంగా వందలాది మందికి అన్న సంతర్పణ గావించారు. ఆలయ ధర్మకర్త యాదయ్య, లంకా భరత్ ప్రసాద్ సిద్ధాంతి, నర్సింహ, వేముల వెంకటేశ్, బండారి కృష్ణాచారి, కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



జవహర్ నగర్ శ్రీ సాయిబాబా దేవాలయంలో దత్తాత్రేయ జయంతి

క్రీడా ప్రాంగణంలో ఐదడుగుల గుంత!



ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణంలో తవ్విన గుంత

బోరబండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణంలో తవ్విన గుంత స్థానికంగా కలకలం రేపుతోంది. క్రీడా ప్రాంగణంలో గురువారం రాత్రి జేసీబీతో గుంతను తవ్వారని, శుక్రవారం ఉదయం పీజీ కళాశాల, హాస్టల్ నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు సదరు జేసీబీ డ్రైవర్ తెలిపినట్లు స్థానికులు చెబుతున్నారు. ఎవరికీ ఎటువంటి సమాచారం లేకుండా క్రీడా ప్రాంగణం నడిబొడ్డున ఐదడుగుల గుంతను తవ్వడం అయోమయానికి గురి చేస్తున్నదని స్థానికులు పేర్కొంటున్నారు. ఎస్పీఆర్ హిల్స్ లోని ఈ క్రీడా ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు, క్రిస్మస్ ఉత్సవాలు, రంజాన్-బక్రీద్ పండుగల సామూహిక ప్రార్థనలతో పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రీడా ప్రాంగణం అలాగే కొనసాగనివ్వాలని స్థానికులు కోరుతున్నారు.

అడ్డుకుంటాం:

క్రీడా ప్రాంగణంలో చేపట్టనున్న నిర్మాణాలను తాము అడ్డుకుంటామని రహ్మత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సి.ఎన్. రెడ్డి తెలిపారు. క్రీడాప్రాంగణం మధ్యలో గుంతను ఎవరు, ఎందుకు తవ్వారో తనకు సమాచారం లేదని చెప్పారు.



నాటక పోటీలు..

అటవీ శాఖ నిర్వహించిన నెమళ్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన నాటక పోటీలలో మొదటి బహుమతి సాధించిన ఎంజీఎం స్కూల్ విద్యార్థులు. అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఎం నాయుడు, ఉపాధ్యాయులు.

- యూసుఫ్ గూడ, (ఆంధ్రజ్యోతి)



మీనాక్షి నటరాజన్‌ను కలిసిన శ్రీగణేశ్

కంటోన్మెంట్‌లో 'హస్తం' బలోపేతంపై చర్చ

మీనాక్షి నటరాజన్‌తో ఎమ్మెల్యే భేటీ

సికింద్రాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ముందుకు సాగుతున్నట్టు ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ తెలిపారు. ప్రభుత్వ పనితీరును ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిపించడం, ఇతర పార్టీల శ్రేణులను, తటస్తులను పార్టీలోకి చేరేలా చూడడం తదితర చర్యల ద్వారా పటిష్టం చేస్తున్నట్టు వెల్లడించారు. గురువారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీనాక్షి నటరాజన్‌తోపాటు ఏఐసీసీ ఇన్‌చార్జి సెక్రటరీ విశ్వనాథన్, సచిన్ సావంత్‌లను శ్రీగణేశ్ కలిశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో హస్తం పార్టీ గెలుపుకు అనుసరించాల్సిన వ్యూహం తదితర అంశాలపై కూడా ఆయన విస్తృతంగా చర్చించారు. కాగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసినందుకు ఎమ్మెల్యేను వారు ప్రత్యేకంగా అభినందించారు.

రేణుకా ఎల్లమ్మ కల్యాణం

బౌద్ధనగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బీదలబస్తీలో రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద రేణుకా ఎల్లమ్మ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సీతాఫల్‌మండీ డివిజన్ కార్పొరేటర్ సామల హేమ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరాటేరాజు, రవిప్రసాద్‌గౌడ్, నందారం సీతారాం, గడ్డం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన జంపన

వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు

సికింద్రాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బోయినపల్లి సీతారాంపురంలోని శివపంచాయతన వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. అనంతరం దాతలు సాంబమూర్తి, రాధామహాలక్ష్మిల సహకారంతో కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు సాయిబాబా యాదవ్ మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 500 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు విజయ్‌కుమార్, ప్రకాష్, సత్యనారాయణ, చంద్రమౌళి, సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

భూలక్ష్మమ్మ ఆలయంలో పూజలు

తిరుమలగిరి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమిని పురస్కరించుకుని బొల్లారం డౌటన్‌బజార్, భూలక్ష్మమ్మ దేవాలయంలో అమ్మవారికి గురువారం భక్తులు అభిషేకం, అర్చన, కుంకుమార్చన. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి అరవింద్, కనిష్క, నరేందర్, బాల్‌రాజ్, పూర్ణచందర్, ఖన్నా, సతీష్, రజనికాంత్‌లు పాల్గొన్నారు. లాల్‌బజార్, మహంకాళి దేవాలయంలోనూ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించి అనంతరం అన్నదానం ప్రసాద వితరణ గావించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్, జీవి బాల్‌రాజ్, రాజు, నరేందర్, శ్రీకాంత్ రెడ్డి, పూర్ణచందర్, నిఖిల్, అరుణ్, చంద్రశేఖర్, నాగేందర్‌లు పాల్గొన్నారు.

ఈ పార్కు ఇక ఇంతేనా!

శంకుస్థాపన చేసిన వారానికే నిలిచిపోయిన పనులు

కొన్నేళ్ల నుంచి వృథాగా ఉన్న స్థలం ● పునరుద్ధరించాలని స్థానికుల వినతి



అర్ధాంతరంగా ఆగిపోయిన మున్సిపల్ పార్కు



పార్కు శిలాఫలకం

అడ్డగుట్ట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నియోజక వర్గం అడ్డగుట్ట డివిజన్‌లోని ఆర్ఆర్‌సీ మైదానం(లోహియానగర్ ఏరియా బస్తీ) వద్ద పార్కును 2019 నవంబరులో రూ.18 లక్షల నిధులతో సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. 2019 డిసెంబరులో అర్ధాంతరంగా పార్కు పనులు ఆగిపోవడంతో అడ్డగుట్ట ప్రజలు అవాక్కయ్యారు. ఏమైందో కానీ కాంట్రాక్టర్, జీహెచ్ఎంసీ అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా పార్కు స్థలం రైల్వేదని వదంతులు రావడంతో సమస్యగా మారింది. రైల్వే స్థలమని తెలిసినప్పటికీ జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యం కారణంగా పనులు మొదలు పెట్టిన వారం రోజులకే మూతపడిపోయింది. గత కొన్నేళ్ల నుంచి ఈ స్థలం వృథాగా పడి ఉంది. ఈ స్థలం రైల్వేదా? జీహెచ్ఎంసీదా తేల్చిచెప్పాలని స్థానికులు అనుకుంటున్నారు. ఒకవేళ రైల్వే స్థలం అయితే రైల్వే అధికారులు, ఎమ్మెల్యే చొరవ తీసుకుని ఇక్కడ పార్కును ఏర్పాటుచేస్తే చుట్టుపక్కల ప్రాంతాల వారికి సాయంత్రం వేళ ఆటవిడుపుగా ఉంటుంది. ఇప్పటికైనా సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు ఈ స్థలాన్ని సర్వే చేయించి పార్కు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పార్కు ఏర్పాటు చేయండి



ఆర్ఆర్‌సి మైదానం వద్ద ఉన్న ఈ పార్కు స్థలం కొన్ని కారణాలతో ఆగిపోయింది. ఈ స్థలంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పార్కును కొత్తగా ఏర్పాటు చేయాలి. సాయంత్రం వేళలో సీనియర్ సిటిజన్లు వాకింగ్ నడిచే విధంగా ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఈ ప్రాంతంలో ఎక్కడా పార్కు లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

- రమాదేవి, తుకారాంగేట్



రైల్ నిలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రతినిధులు

కాంట్రాక్టర్లు బాధ్యతతో ఉండాలి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్ నిలయంలో గురువారం జరిగిన టెండర్లు, కాంట్రాక్టర్లు విజిలెన్స్ దృక్పథం అనే అంశంపై జరిగిన కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ రైల్వే విజిలెన్స్ విభాగం సామర్థ్య నిర్మాణ చొరవలో భాగమైన ఫోర్టిపై లెక్చర్ సిరీస్ కింద సమావేశం నిర్వహించడమైందన్నారు. రైల్వేలో కాంట్రాక్టర్లు కాంట్రాక్ట్ వ్యవహరించే సమయంలో అమలులో ఉన్న నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమలో రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ రైల్వే బోర్డు డైరెక్టర్ ఎం శ్రీనివాస్, అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాశ్, సీనియర్ జీఎం పాల్గొన్నారు.

ప్రొఫెసర్ రామ్‌రెడ్డికి నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దూరవిద్య పితామహుడు ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి 96వ జయంతిని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి దూర విద్య కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇగ్నో తొలి వీసీగా, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం స్థాపనలో ప్రధాన పాత్రధారిగా, యూజీసీ చైర్మన్‌గా సేవలందించిన రామ్‌రెడ్డి ఉన్నత విద్యను ప్రజలకు చేరువ చేసిన మహనీయులని డైరెక్టర్ ప్రొ. ఎన్.సి.భట్టాచార్యులు గుర్తు చేశారు. రామరెడ్డి సిద్ధాంతం 'అందరికీ విద్య'ను అందించి ముందుకు తీసుకెళ్లేందుకు దూరవిద్య కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తామని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సంయుక్త డైరెక్టర్ సోమేశ్వర్ పోల, సహాయ డైరెక్టర్ లోకేందర్ రెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ నివేదితతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం పర్యటనతో మారనున్న ఓయూ దశ, దిశ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీని గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని టీపీసీసీ జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటనతో ఓయూ దశ, దిశ మారనుందన్నారు. డిసెంబరు 7న సీఎం ఓయూ పర్యటనను స్వాగతిస్తూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శతాబ్దం పూర్తి చేసుకున్న ఓయూను ప్రక్షాళన చేసి, నిధులు, నియామకాలతో ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న సంకల్పం తో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. సీఎం పర్యటనకు ఓయూ విద్యార్థులు, అధ్యాపకులు స్వాగతం పలకడం సానుకూల పరిణామమని దయాకర్ అభిప్రాయపడ్డారు. ఎన్ఎస్‌యూఐ ఓయూ నేత మేడ శ్రీనివాస్, బట్టపోతుల మోహన్‌రావు, నిరుద్యోగ నేత ఈశ్వర్ నాయక్, మిత్ర, ఈశ్వర్, శ్రీధర్ రెడ్డి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



బోయినపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నందమూరి నగర్ వద్ద బస్టాప్‌లో రెండు రోజుల క్రితం ఓ గుర్తుతెలియని వ్యక్తి గాయపడి ఉండటంతో అతడిని పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు గురువారం మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. ఆ వ్యక్తి ఆచూకీ తెలియకపోవడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామని, ఆచూకీ తెలిస్తే బోయినపల్లి పోలీసులను ఆశ్రయించాలని ఎస్ఐ అవినాష్ బాబు తెలిపారు.

మహిళ అదృశ్యం



సునీత

బోయినపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ అవినాష్ తెలిపిన వివరాల ప్రకారం లాలియ్య అతడి భార్య రాత్లావత్ సునీత(27) ఆర్ఆర్‌నగర్‌లో నివాసముంటున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఆమె బయటకు వెళ్లి వస్తానని వెళ్లి తిరిగిరాలేదు. ఆమె గురించి బంధువులు, తెలిసినవారిని ఆరా తీసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో భర్త బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే ప్రవీణ్ అనే వ్యక్తికి సునీతకు ప్రేమ వ్యవహారాలు నడుస్తున్నాయని అతడితో ఫోన్‌లో మాట్లాడుతుండటం గమనించానని ప్రవీణ్ అనే వ్యక్తి పైనే అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో ప్రవీణ్ ఫోన్ నంబరు ఆధారంగా విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఆహ్వానం

మహాపడి పూజ, రథోత్సవానికి హాజరు కావాలని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను గురువారం లాలాపేట అయ్యప్ప భక్త సమాజం ప్రతినిధులు కలిసి ఆహ్వానించారు. - రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి



విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు తిలకిస్తున్న ఇంద్ర రాణి

సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత

బోయినపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని మమతా విద్యాలయాల డైరెక్టర్ ఇంద్ర రాణి అన్నారు. మమతా హైస్కూల్‌లో రెండు రోజుల పాటు సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విద్యార్థుల చేసిన ప్రయోగాలను వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు రూపొందించే ప్రాజెక్టులు పేటెంట్ తీసుకునే స్థాయికి ఎదిగేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు.

వీడియో జర్నలిస్టు మృతి బాధాకరం



దామోదర్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీమంత్రి కేటీఆర్

అడ్డగుట్ట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ వీడియో జర్నలిస్టు దామోదర్ అకాల మృతి చాలా బాధాకరమని మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. ఈ విషయం తెలుసుకుని మాజీమంత్రి కేటీఆర్ గాంధీ మార్చురీకి చేరుకుని దామోదర్‌కు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ మీడియా సంస్థలో సీనియర్ వీడియో జర్నలిస్టు మరణం బాధకరమన్నారు. దామోదర్ కుటుంబ సభ్యులను ఓదార్చి, తమ పార్టీ వారి కుటుంబానికి ఎల్లవ్వుడు అండగా ఉంటుందని తెలిపారు. కేటీఆర్ వెంట పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఓటు చోరీ సర్వేలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఓటు చోరీపై క్యాంపెయిన్ సర్వే

అడ్డగుట్ట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఓటుహక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ గురువారం అడ్డగుట్ట డివిజన్‌లోని పలు బస్తీలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంద సురేష్, లలిత, రమేష్, మంద ప్రభాకర్, ఇతర నాయకులు ఇంటింటికి తిరిగి ఓటు చోరీ సర్వేలో పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటును సద్వినియోగం చేసుకోవాలంటూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. పూర్తి సర్వే అనంతరం ఎన్నికల కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తామని వారు తెలిపారు.

'సమస్యలు పరిష్కరించడానికే బస్తీల పర్యటనలు'

మారేడుపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ బోర్డు నాలుగో వార్డు పరిధిలోని రాజలింగం గార్డెన్, శ్రీరంగ గార్డెన్స్‌లో గురువారం కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేశ్ పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీలు, కాలనీల్లో ఉన్న సమస్యలను తెలుసుకోవడానికి తాము బస్తీ పర్యటనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చి సమస్యలతో పాటు, తాను గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరావు, సత్యనారాయణ, కిరణ్, ఆనంద్, సురేఖ, మహేష్, సాంబశివ, ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్‌ను కూడా విలీనం చేయాలి

సికింద్రాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శివారు మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం నగరం నడిబొడ్డున ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను కూడా విలీనం చేసుకోవాలని కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్ కోరారు. ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని 27 మున్సిపాలిటీలను గ్రేటర్‌లో విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని గురువారం ఓ ప్రకటనలో ఆయన స్వాగతించారు. కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయడానికి రక్షణ శాఖతో జరుగుతున్న చర్చలను మరింత ముందుకు తీసుకువెళ్లాలని, విలీనం చేసిన తర్వాత జీహెచ్ఎంసీతోపాటు ఎన్నికలు నిర్వహించాలని ఆయన కోరారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు, సర్వేజనా ఫౌండేషన్ ప్రతినిధులు

వాహనదారులకు అవగాహన : ఏసీపీ

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలకు ప్రధానంగా అధిక వేగం, డ్రంకన్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ జంప్, రాంగ్ రూట్, సీటు బెల్ట్,హెల్మెట్ ధరించక పోవడం కారణమని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. గురువారం సికింద్రాబాద్ సంగీత్ చౌరస్తాలో సర్వేజనా ఫౌండేషన్, ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో యమధర్మరాజు గెటప్‌లో ఉన్న వ్యక్తితో వినూత్నంగా వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఇండియాలోని 50 ప్రధాన నగరాల్లో హైదరాబాద్ రోడ్డు ప్రమాదాల్లో ఏడవ స్థానంలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలు శ్రీధర్, సర్వేజనా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరీక్షలు వాయిదా వేయాలని వినతి

అడ్డగుట్ట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గ్రామ పంచాయతీల్లో 14న జరిగే సర్పంచ్ ఎన్నికల రోజునే హైదరాబాద్‌లో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరీక్షలు జరగనున్నాయి. ఎన్నికల రోజున పరీక్షలకు ఎలా హాజరు కావాలని పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేరోజు జరిగే సర్పంచ్ ఎన్నికల్లో కొందరు న్యాయవాదులు పోటీ చేస్తున్నారు. కనుక ఈ పరీక్షను వెంటనే రద్దు చేసి మరో తేదీని నిర్ణయించాలని కోరుతూ శ్రీనివాస్ అనే ప్రముఖ న్యాయవాది తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ ఐపీఎస్ అధికారి శ్రీనివాస్, ఎన్నికల కమిషన్‌కు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఒకవేళ పరీక్షలు నిర్వహిస్తే సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం ఉండదని, తాము ఎన్నికల్లో ఓటు వేయాల వద్దా అని తర్జన భర్జన పడుతున్నామని తెలిపారు



ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయ స్వామి



గోమాతకు ప్రసాద సమర్పణ, హారతి పూజలో పాల్గొన్న భక్తులు



భక్తులకు ప్రసాదం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, కమిటీ సభ్యులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఆలయ ఫౌండర్ దంపతులు

కనులపండువగా దత్తాత్రేయ జయంతి

మారేడుపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాకగూడాలోని శ్రీ వీరంజనేయ స్వామి సహిత కాశీ విశ్వేశ్వర స్వామి శ్రీపాద వల్లభ శ్రీ గురు దత్తాత్రేయ దేవాలయంలో గురువారం శ్రీ గురు దత్తాత్రేయ జయంతి హోత్సవాలు వైభవంగా జరిగాయి. కాకాగూడ వెల్ఫేర్ అసోసియేషన్ దేవాలయ కమిటీ వేద పండితులు హేమంత్ శర్మ పర్యవేక్షణలో నిర్వహించిన వేడుకలకు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుకా నర్మదా మల్లికార్జున, కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ జె.రామకృష్ణ, కమిటీ ప్రధాన కార్యదర్శి భిక్షపతి, అధ్యక్షులు బాలకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాదం సమర్పించి హారతి ఇచ్చారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రారంభించారు.

బౌద్ధనగర్‌లో..

బౌద్ధనగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండీ, చిలకలగూడల్లో గురువారం దత్త జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సీతాఫల్‌మండీ దత్తాత్రేయస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ సామల హేమ ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. నాయకులు కరాటేరాజు, రాజుసుందరం తదితరులు పాల్గొన్నారు. చిలకలగూడలో వీరాంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఉన్న దత్తాత్రేయస్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. సభ్యులు సుదర్శన్, కుప్ప శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్‌బజార్‌లోని హనుమాన్ దేవాలయంలో గురుదత్త జయంతి గురువారం ఘనంగా జరిగింది. దత్తాత్రేయస్వామికి ఈఓ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి సాయవ్రతం చేశారు. అదేవిధంగా లలితా త్రిపుర సుందరీ దేవి అమ్మవారికి ఆలయ వ్యవస్థాపకులు, ఎస్బీఐ బ్యాంకు మాజీ జనరల్ మేనేజర్ పరుశ నిరంజన్ వెంకట రమణి దంపతులు పూజలు నిర్వహించారు.



మారేడుపల్లి సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయం ఆవరణలోని సాయిబాబా ఆలయంలో గురువారం జరిగిన శ్రీ గురు దత్తాత్రేయ జయంతి మహోత్సవ వేడుకల్లో ఆలయ చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు, కమిటీ పాలకమండలి సభ్యులు, ప్రధాన అర్చకులు రాజేశ్వర శర్మ, సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్ వేణుగోపాల్ రెడ్డి, సంతోష్ యాదవ్, నాగేందర్ యాదవ్, పిట్ల నాగేష్ తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

- మారేడుపల్లి, ఆంధ్రజ్యోతి



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ సామల హేమ



చిలకలగూడలో దత్తాత్రేయ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు